క్లుప్తంగా

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఉర్దూ మాధ్యమం అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంఎస్సీ అర్హత కలిగి ఉర్దూ బోటని, సివిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులున్న వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 7వ తేదీలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, 11న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

రేపు పెన్షనర్ల సంఘం సమావేశం

మైదుకూరు : మైదుకూరు మండల పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 5వ తేదీ శనివారం జరుగుతుందని సంఘం అధ్యక్షుడు పాలిమేర ఓబన్న, కార్యదర్శి కుల్లాయిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సాయినాథపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం 9 గంటలకు జరిగే సమావేశంలో మండలంలోని పెన్షనర్లందరూ పాల్గొనాలని వారు కోరారు.

రివిట్ సాఫ్ట్‌వేర్‌పై వర్క్‌షాప్



శిక్షణ ఇస్తున్న ట్రైనర్

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి ఆఫ్ యోగివేమన యూనివర్సిటీలో 3, 4 సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు రివిట్ సాఫ్ట్‌వేర్ వారిచే వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. థిరిటికల్ నాలెడ్జ్ ఎంత ఉన్నా, ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకపోతే ఉద్యోగ అవకాశాలు సంపాదించడం చాలా కష్టతరమన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎన్.హరినాథరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి వర్క్ షాప్‌లు మరిన్ని నిర్వహిస్తామని అన్నారు. ఈ వర్క్‌షాపుల ద్వారా విద్యార్థులు ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఆచార్య కేవీ రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

5న షూటింగ్ బాల్ ఎంపికలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు జూనియర్ విభాగంలో జిల్లా స్థాయి బాలబాలికల షూటింగ్ బాల్ పోటీలను నిర్వహించనున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2004 ఏప్రిల్1వ తేదీ తర్వాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 6303666026 నంబరులో సంప్రదించాలని కోరారు.

తల్లీబిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం




ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కాశినాయన : తల్లీబిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, గంగనపల్లె సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గంగనపల్లె గ్రామంలో గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే సరుకులు (టీహెచ్‌ఆర్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, మహిళా సంరక్షణ కార్యదర్శి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెడ్మాస్టర్ మృతి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో గురువారం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు తిప్పన సుబ్బరాయుడు (92) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఉపాధ్యాయుడుగా లింగాలదిన్నెపల్లె, చెంచయ్యగారిపల్లె, గంగిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, బి.మఠం తదితర గ్రామాల్లో పని చేశారు. ఆయన మృతిపట్ల ఆయన శిష్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరించిన పరిశీలకులు



ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుల సమావేశం గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జమ్మలమడుగు, ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిశీలకులు కల్లూరు నాగేంద్రారెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి శాలువాకప్పి సత్కరించారు. కార్యక్రమంలో అనుడా చైర్మన్ గురుమోహన్ పాల్గొన్నారు.

త్వరలో కేసీకి సాగునీరు..

సాగుకు సమాయాత్తం కావొచ్చు

- రైతులను తిప్పకోకుండా చుక్కల భూములను పరిష్కరించాలి
- గ్రామ సచివాలయం, ఆర్బీకేలకు అదనపు నిధులు మంజూరు
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

చాపాడు : ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి.. ఇప్పటికే శ్రీశైలం జలాశయంలో 856 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.. నీటిమట్టం ఇంకా పెరుగుతోంది.. త్వరలోనే పోతిరెడ్డిపాడు ద్వారా కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.. ఆయకట్టు పరిధిలోని రైతులందరూ పంటలు సాగు చేసుకునేందుకు సమాయాత్తం కావచ్చు.. అని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో గురువారం మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ లోపల కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేస్తామన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు తీసుకెళ్ల వచ్చన్నారు. మండల వ్యాప్తంగా 3600 మంది రైతులకు చెందిన 2700 ఎకరాల చుక్కల భూములకు ప్రభుత్వం విముక్తి కలిగించిందన్నారు. చుక్కల భూములు కలిగిన రైతులందరూ రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. రైతులను తిప్పుకోకుండా చుక్కల భూముల పనులు చేయాలని తహసీల్దార్ సుభానీకి సూచించారు. గ్రామాల్లో నిర్మితమవుతున్న గ్రామ సచివాలయాలకు రూ.3.60 లక్షలు, రైతు భరోసా కేంద్రాలకు రూ.2.14 లక్షలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు రూ.3.30 లక్షలను ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిందన్నారు. కాంట్రాక్టర్లు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఉప ఎంపీపీ శుభకరుణమ్మ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వ్యవసాయాధికారి మ్యాగీ, పంచాయతీరాజ్ ఏఈ ఈశ్వరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో

బలవర్థకమైన పోషకాహారం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, అధికారులు

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నారులకు బలవర్థకమైన పోషకాహారాన్ని అందిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో గురువారం టేక్ హోం రేషన్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పౌష్టికాహారం పంపిణీకి సంబంధించి టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని గమనించాలని కోరారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా ప్రతి నెల గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన బియ్యం, కందిపప్పు, పామాయిల్, బెల్లం, ఖర్జూరాలతోపాటు రాగిపిండి, చెక్కీలు, అటుకులు తదితర వస్తువులను అందిస్తున్నారన్నారు. వీటిని తినడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని తెలిపారు. గతంలో వీరికి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం ఏర్పాటు చేసేవారని, ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ప్రభుత్వం టేక్ హోం రేషన్ విధానాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళలు రక్తహీనతతో బాధపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, అర్బన్, రూరల్ సీడీపీఓలు హైమావతి, అరుణ కుమారి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యతోపాటు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వెంకటరమణ



బద్వేలు అర్బన్ : రానున్న అసెంబ్లీ ఎన్నికలు, ప్రత్యేక ఓటరు సవరణ – 2024 కార్యక్రమం నేపథ్యంలో ఆయా నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (ఈఆర్ఓ) ను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో బద్వేలు నియోజకవర్గ ఎన్నికల అధికారిగా ఆర్డీఓ ఆకుల వెంకటరమణను నియమించారు. ఓటర్ల తుదిజాబితా తయారీ మొదలు ఎన్నికల నిర్వహణ వరకు ఈయన ఈఆర్ఓగా కొనసాగనున్నారు.

నేడు మహానందిపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కలసపాడు : మండలంలోని మహానందిపల్లెలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ఆకులనారాయణపల్లెలో స్నానానికి వెళుతున్న పీర్లు

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె, కొండ్రాజుపల్లె గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా జరుపుకునే పండుగ మొహర్రం. బుధవారం అర్ధరాత్రి పెద్దసరిగెత్తు సందర్భంగా గుండం ఏర్పాటు చేసి పీర్లను ఊరేగించారు. గురువారం మంగళ, డప్పువాయిద్యాలతో పీర్లను స్నానానికి తీసుకెళ్లారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పీర్లను చదివింపులు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రతి ఇంటికి జగనన్న సురక్ష కేలండర్ చేరాలి

చాపాడు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికి జగనన్న సురక్ష కేలండర్లు, ప్రభుత్వ పథకాల మంజూరు పత్రాలు అందాలని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం మండల అభివృద్ధి అధికారి శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని 15 గ్రామ సచివాలయాల కార్యదర్శులకు జగనన్న సురక్ష కేలండర్లు, సంక్షేమ పథకాల మంజూరు ధ్రువీకరణ పత్రాల బుక్ లెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

పేదల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించండి



మున్సిపల్ అధికారికి వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని పేదలు నివసించే కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 సంవత్సరాల కిందట ఏర్పడిన వీణా విజయరామరాజు కాలనీ, చెంచుకాలనీ, వెంకటసుబ్బయ్య కాలనీ, దస్తగిరిపేట కాలనీలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని, పలుమార్లు విజ్ఞప్తులు చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 20వ తేదీ లోపు మౌలిక వసతులు కల్పించకుంటే 21వ తేదీ నుండి ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. ఆ మేరకు మున్సిపల్ అధికారి సుబ్బరాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములు, ఏవీ శివరామ్, పి.భాస్కర్, వీవీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక హుసేన్‌పీర్ దర్గా



బద్వేలులోని హుసేన్‌పీర్ స్వాముల వారి దర్గా



దర్గా లోపలి స్వామి వారి సమాధి

రేపటి నుంచి 198వ ఉరుసు

బద్వేలు అర్బన్ : బద్వేలులోని దర్గావీధిలో వెలసిన శ్రీహజరత్ హుసేన్‌పీర్ ఔలియా స్వాముల వారి 198వ ఉరుసు మహోత్సవాలు శని, ఆదివారాలలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. హజరత్ సయ్యద్ హుసేన్‌పీర్‌స్వామి హిందూ మహమ్మదీయ మత సామరస్యతకు, సఖ్యతకు ఆవిరళ కృషి చేసిన మహనీయుడు. స్వామి వారి పూర్వీకులు సౌదీ అరేబియా నుండి వచ్చి ఆధ్యాత్మిక, ధర్మ ప్రబోధాన్ని ప్రచారం చేస్తూ చిత్తూరు జిల్లా గుర్రంకొండ ప్రాంతంలో నివసించేవారు. ఆ కుటుంబంలోని హుసేన్‌పీర్ స్వామి ఆధ్యాత్మిక, ధర్మ ప్రవచనాలను ప్రజలకు బోధిస్తూ బద్వేలు ప్రాంతానికి చేరుకున్నారు. బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాల్లో అనేక మంది హిందూ, మహమ్మదీయులను తన శిష్యులుగా చేర్చుకొని వారికి ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ తన మహిమలతో శారీరక, మానసిక రుగ్మతలను పోగొట్టేవారు. 198 సంవత్సరాల క్రితం తన శిష్యులతో కలసి బద్వేలు నుంచి పోరుమామిళ్లకు వెళుతూ మార్గమధ్యంలో దేహపరిత్యాగం చేశారు. పోరుమామిళ్లకు చెందిన శిష్యులు స్వామి వారి దేహాన్ని పోరుమామిళ్లలో ఖననం చేయాలని తలచి పార్థివ శరీరాన్ని పోరుమామిళ్లకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, ఎంత మంది కలసి ప్రయత్నించినా అధిక బరువుతో స్వామి దేహం పైకిలేయలేదు. బద్వేలుకు చెందిన శిష్యులు తాము తీసుకువెళతామని బద్వేలు మార్గం వైపు తిరిగి దేహాన్ని పైకి లేపగా ఎంతో తేలిగ్గా పైకి లేచిందని, దాంతో స్వామి దేహాన్ని బద్వేలులో ఖననం చేసి దర్గా నిర్మించినట్లు పూర్వీకుల కథనం. అప్పటి నుంచి ప్రతి ఏటా మొహర్రం నెలలో ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బద్వేలులో ఉరుసు ముగిసిన తర్వాత అదే నెలలో పోరుమామిళ్ల పట్టణంలో కూడా స్వామి వారి ఉరుసు నిర్వహిస్తారు. బద్వేలులో స్వామి నాల్గవ తరం వారసులు దర్గా రహమతుల్లా సాహెబ్, దర్గా షఫీవుల్లాసాహెబ్‌ల ఆధ్వర్యంలో శనివారం గంధం, ఆదివారం ఉరుసును వైభవంగా నిర్వహించనున్నారు. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన హిందూ, మహమ్మదీయ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు జరుపుతారు. ప్రముఖ గాయకులచే ఖవ్వాలి నిర్వహిస్తారు.

మణిపూర్ అల్లర్లను తక్షణమే కట్టడి చేయాలి



మణిపూర్ ఘటనకు నిరసనగా బద్వేలులో ర్యాలీ నిర్వహిస్తున్న శాంతికమిటీ సభ్యులు

బద్వేలు అర్బన్ : గత కొన్ని నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను తక్షణమే కట్టడి చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని పట్టణ పీస్‌కమిటీ నాయకులు రెవరెండ్ నందం ఐజాక్, రెవరెండ్ ఫాదర్ గొడుగునూరు విజయరావు, రెవరెండ్ ఫాదర్ ఆరోగ్యరాజు, ఆనంద్‌కుమార్, రెవరెండ్ వి.భాస్కర్, రెవరెండ్ డి.శ్యామూల్‌లు కోరారు. మణిపూర్‌లో జరుగుతున్న అమానవీయ సంఘటనలకు నిరసనగా గురువారం పట్టణంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా ఘోరమైన దుర్ఘటనలు జరుగుతున్నా కట్టడి చేయలేని అక్కడి రాష్ట్ర ప్రభుత్వం, సమస్య తీవ్రతను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోలేని కేంద్ర ప్రభుత్వం భారతావనికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్మపరిచయ కమిటీ జిల్లా నాయకుడు బాబూభాయ్, మాస్క్ కమిటీ అధ్యక్షుడు అల్లాబకాష్, కార్యదర్శి సరిటాల మౌలాలి, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర నాయకుడు వెంకటసుబ్బయ్య, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం స్పందించాలి

పోరుమామిళ్ల : మణిపూర్ ఘటనపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇంతవరకు స్పందించకపోవడం దురదృష్టకరమని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి సామాజిక సంఘాల అధ్యక్షుడు ఇండ్ల రామసుబ్బయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య అన్నారు. గురువారం పోరుమామిళ్లలో వారు మాట్లాడుతూ గిరిజనులపై అత్యాచారాలు, మారణకాండ లాంటి ఘటనలు దారుణమన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. అందుకే అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తోందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఖాజీపేట మేజర్ పంచాయతీలో జరిగింది. బుడ్డాయపల్లె, చెర్లోపల్లి, సిద్ధాంతిపురం గ్రామాల్లో ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాల జాబితా లబ్ధిదారులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో సంక్షేమ ఫలాల కోసం జన్మభూమి కమిటీలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. కానీ నేడు ఆ అవసరం లేకుండా పోయిందన్నారు. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేస్తోందని చెప్పారు. రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ సకాలంలో ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటోందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం మార్పు

బుడ్డాయపల్లె గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం సరిగా లేదనే విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన స్థానికంగా ఉన్న కమ్యూనిటీ భవనాన్ని పరిశీలించి మరమ్మతులు చేసి నెల రోజుల్లో ఈ భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చాలని అధికారులకు సూచించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైదుకూరు నియోజకవర్గ కన్వీనర్ శెట్టిపల్లి నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, సర్పంచ్ యన్నం రాణెమ్మ, ఉప మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివరామిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాల లక్ష్యం నెరవేర్చాలి

మండల ప్రత్యేక అధికారి రాఘవేంద్ర కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాఘవేంద్ర కుమార్

రాజుపాళెం : మండలంలోని గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేసిన పక్కా గృహాలను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాఘవేంద్ర కుమార్ తెలిపారు. రాజుపాళెంలోని మండల పరిషత్ సభాభవనంలో గురువారం హౌసింగ్ అభివృద్ధిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యాలను పూర్తి చేయడంలో ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దన్నారు. జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కొక్క గుంతకు రూ.6వేలు మంజూరు చేస్తామన్నారు. పక్కా గృహాలు నిర్మించుకోని లబ్ధిదారులతో మాట్లాడి వీలైనంత త్వరగా నిర్మాణాలను ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. మండల వ్యాప్తంగా 562 ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 331 గృహాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ ఏఈ శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ ఇందిరారాణి, ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, ఆయా శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నాగసానిపల్లెలో రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

ఖాజీపేట : గ్రామాల్లో మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. నాగసానిపల్లెలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది అందించే సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దోమతెరలు వాడటం, మురుగు కాలువల్లో వేస్ట్ ఆయిల్ వేయడం, డ్రైడే పాటించడం ఇలా సూచనలు, అవగాహన కల్పించాలన్నారు. 7వ తేదీ నుంచి మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తర్వాత నాగసానిపల్లె ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంతోపాటు వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి లక్ష్మీకర్, హెల్త్‌ఎడ్యుకేటర్ మరియకుమారి, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలను పరిశీలించిన చీఫ్ ఇంజినీర్



సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ సీఈ

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని కానపల్లెలో కొత్తగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం పనులను గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలసి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీటి నిర్మాణానికి 50 సెంట్లు స్థలం విరాళంగా ఇచ్చిన సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డిని ఆయన అభినందించారు. అలాగే కొత్తపల్లె సచివాలయం–1ని ఆయన సందర్శించి విజిటర్స్ డైరీని పరిశీలించారు. అక్కడి సచివాలయ సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్‌కు కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, యువ నాయకుడు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు డీఈ హరినాథ్, ఈఈ నాగేశ్వర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ శ్యాంసుందర్ రాజు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరానందగిరి స్వామికి ఘన నివాళి



గంగాధరానంద స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలో గురువారం గీతాశ్రమ పూర్వ పీఠాధిపతి గంగాధరానందగిరి స్వామి తృతీయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మళయాళస్వామి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీ కృష్ణ గీతాశ్రమ పీఠాధిపతిగా గంగాధరానంద గిరి స్వామి ఆశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. వ్యాపార వేత్త సీవీ సుబ్బారావు,శారదా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేష్ బాబు మాట్లాడారు. తొలుత గంగాధరానంద స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌కేజీ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లెల్లలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పర్యటన

దువ్వూరు : మండలంలోని జిల్లెల్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను శనివారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభిస్తారని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి గురువారం తెలిపారు. అలాగే ఉదయం 7 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

గర్భిణులకు సంపూర్ణ ఆహార కిట్లు పంపిణీ

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయంలో గురువారం గర్భిణులు, బాలింతలకు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ సంపూర్ణ ఆహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంపూర్ణ ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఈఓపీఆర్డీ హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయానికి తాగునీటి బోరు ఏర్పాటు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని డి.నేలటూరు గ్రామ సచివాలయానికి తాగు నీటికోసం గురువారం బోరుకు మోటారు ఏర్పాటు చేశారు. మైదుకూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్ మణ్యం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నీటి సమస్యకు పరిష్కారం చూపినట్లు స్థానికులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

దువ్వూరు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎర్రబల్లె గ్రామం వద్ద గురువారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనం నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, బహుళ చక్రాల వాహనాల చోదకులు సీట్‌బెల్టు పెట్టుకోవాలన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.